RNI REG.NO. TELTEL/2021/83468

# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక

www.republichindustan.in






# రేపు బీహార్ తొలి దశ పోలింగ్




♦ తేజస్వి సహా 16 మంది మంత్రులకు పరీక్ష

పాట్నా, నవంబర్ : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన తొలి దశ పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. నవంబర్ 6న 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ దశలో పలువురు ప్రముఖ నేతల భవితవ్యం తేలనుంది. మంగళవారం ప్రచారం ముగియడంతో ఎన్నికల రంగం వేడెక్కింది. నితీశ్‌కుమార్ ప్రభుత్వం ఈ తొలి విడతలోనే ప్రజా తీర్పును ఎదుర్కోనుంది. కేబినెట్‌లోని 16 మంది మంత్రులు తమ గద్దెను కాపాడుకోవడానికి పోటీ పడుతున్నారు. వీరిలో 11 మంది బీజేపీ, ఐదుగురు జేడీ(యూ) కోటాకు చెందినవారు. మరోవైపు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తమ అభ్యర్థిత్వాలపై గెలుపు కోసం తీవ్ర శ్రమ చేశారు.

– కీలక నియోజకవర్గాలు... హోరాహోరీ పోరు

ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లాలోని తారాపూర్ నుంచి బరిలో ఉన్నారు. ఇక్కడ ఆర్జేడీతో పాటు జన్ సురాజ్, జన్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థులు కూడా రింగులో ఉండటంతో నాలుముఖ పోరు నెలకొంది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్ – తేజస్వి కుటుంబానికి దుర్భేద్య కోటగా పరిగణించే ఈ స్థానంలో, తేజస్వి ఎన్డీయే అభ్యర్థి సతీష్ యాదవ్‌ను ఢీకొంటున్నారు. పాట్నా రూరల్ ప్రాంతంలోని మొకామా స్థానం దులార్‌చంద్ యాదవ్ హత్య కేసు నేపథ్యంలో చర్చనీయాంశమైంది. జేడీ(యూ) నుంచి అనంత్ సింగ్, ఆర్జేడీ తరఫున వీణా దేవి పోటీ చేస్తున్నారు. ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాల వారే కావడంతో పోరు

## ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్‌లో ఏపీ కంపెనీకి చోటు

న్యూఢిల్లీ, నవంబర్ 5

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ బ్యాటరీ తయారీ సంస్థ అమర రాజా గ్రూప్ మరో అరుదైన ఘనతను సాధించింది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థ ఫోర్బ్స్ రూపొందించిన ప్రపంచ ఉత్తమ ఉద్యోగదాతలు - 2025 జాబితాలో అమర రాజా స్థానం సంపాదించింది. ప్రపంచ వ్యాప్తంగా 31 కంపెనీలతో రూపొందించిన ఈ జాబితాలో అమర రాజా 28వ స్థానంలో నిలవడం విశేషం. వంద పాయింట్లలో 63.65 పాయింట్లు సాధించి టాప్-30లో చోటు దక్కించుకుంది. దేశవ్యాప్తంగా మొత్తం ఆరు సంస్థలు మాత్రమే ఈ జాబితాలో నిలిచాయి. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కటే కంపెనీగా అమర రాజా ఉండటం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. బ్యాటరీల తయారీ రంగంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన అమర రాజా గ్రూప్ అనేక దశాబ్దాలుగా సాంకేతికత, నాణ్యత, సేవల పరంగా




మొదటి పేజీ తరువాయి భాగం 2 లో

## వరల్డ్ కప్ కోచ్‌కు ఘన స్వాగతం..




ముంబై, నవంబర్ 5 :

ప్రపంచ కప్ కోసం 47 ఏళ్లుగా నిరీక్షిస్తున్న భారత మహిళల జట్టు కలను సాకారం చేశాడు కోచ్ అన్మోల్ మజుందార్ క్రికెటర్‌గా పెద్ద రికార్డులేమీ సాధించని అతడు హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని ఛాంపియన్లుగా మలిచిన తీరును వేనోళ్ల కొనియాడుతున్నారు క్రీడా ప్రముఖులు. దశాబ్దాలుగా అందకుండా ఊరిస్తున్న మెగా ట్రోఫీని పట్టేయడంలో కీలకమైన మజుందార్‌పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. భారత జట్టు గొప్ప కోచ్‌లలో ఒకడిగా ఆయన పేరు దేశమంతా మార్మోగిపోతోంది. ఆయన కంటపడితే చాలు అభినందనల్లో ముంచెత్తుతున్నారు ఫ్యాన్స్. మహిళల జట్టు చరిత్ర సృష్టించడంలో కీలకమైన మజుందార్‌కు అతడి నివాసం వద్ద ఘన స్వాగతం లభించింది.హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియాను వరల్డ్ కప్ ముద్దాడేలా చేసిన కోచ్ మజుందార్‌కు ఇరుగుపొరుగు వాళ్లు వినూత్నంగా స్వాగతం పలికారు. విల్లే పార్లేలోని తన నివాసానికి మంగళవారం ఆయన వెళ్లగానే.. స్థానికులు అభినందల్లో ముంచెత్తారు. బ్యాండ్ బాజాలతో.. గులాబా రెమ్మలతో మజుందార్‌కు స్వాగతం పలికారు. కొందరు బ్యాట్లు చేతబూని అచ్చం క్రికెట్ మైదానంలో మాదిరిగా గార్డ్ ఆఫ్ హానర్‌తో ఆయనకు మర్చిపోలేని విధంగా వెల్‌కమ్ చెప్పారు. తనపై వాళ్లు

మొదటి పేజీ తరువాయి భాగం 2 లో

## రేవంత్‌కు నోటి విలువ లేదు... నీటి విలువ లేదు : నిరంజన్ రెడ్డి




కేసీఆర్‌పై అడ్డగోలుగా విమర్శలు చేయడం సంస్కారం కాదని మండిపాటు
– తెలంగాణ సాధన, అభివృద్ధిలో కేసీఆర్ నాయకత్వం చరిత్రలో నిలుస్తుందని ప్రశంస

హైదరాబాద్, నవంబర్ 4 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నోటి విలువ, నీటి విలువ రెండూ తెలియవని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన కేసీఆర్‌పై సీఎం రేవంత్ అడ్డగోలుగా మాట్లాడడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో సాగిన తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతేనని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మైనారిటీలకు కాంగ్రెస్ అండ – ఉత్తమ్ కుమార్ రెడ్డి

– "దేశం నుంచి గ్రామం వరకు కాంగ్రెస్‌నే నిజమైన సెక్యులర్ పార్టీ" – ఉత్తమ్
– మైనారిటీల విద్య, సాధికారత కోసం తీసుకుంటున్న చర్యలను వివరించిన ఉత్తమ్



(హైదరాబాద్, నవంబర్ 4, :
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసుఫ్‌గూడలో మైనారిటీలతో సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్‌నే నిజమైన సెక్యులర్ పార్టీగా పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు సెక్యులర్ విలువలను కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెస్‌నే అని, దేశ వ్యాప్తంగా బీజేపీని ఎదుర్కొని ఓడించే శక్తి కూడా కాంగ్రెస్‌కే ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని మైనారిటీలను కోరారు.
మైనారిటీల సాధికారత కోసం విద్య, ఉపాధి రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఉత్తమ్ వివరించారు. దేశంలోనే అత్యధిక మైనారిటీ సంక్షేమ బడ్జెట్ తెలంగాణలో ఉందని తెలిపారు. మైనారిటీ కాలేజీలకు 2,200 కొత్త ఇంజినీరింగ్ సీట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదనంగా ఒక లా కాలేజ్, ఒక ఫార్మసీ కాలేజ్‌ను మైనారిటీల కోసం ఆమోదించటం ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని ఆయన పేర్కొన్నారు.
4% ముస్లిం రిజర్వేషన్‌ను కాపాడేందుకు కాంగ్రెస్ సుప్రీంకోర్టులో బలంగా వాదిస్తున్నదని ఉత్తమ్ తెలిపారు. మైనారిటీల హక్కులు,

## ముఖ్య సలహాదారుగా బాధ్యలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

హైదరాబాద్, 5 నవంబర్ ;

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారిగా సుదర్శన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించగా, మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లోని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డిని సన్మానించి అభినందనలు అందజేశారు. నూతన పదవిలో ప్రజా సమస్యల పరిష్కారం, పాలనలో పారదర్శకత,




అభివృద్ధి కార్యక్రమాల అమలులో సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తారని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర

## కొత్త ఎక్సైజ్ పాలసీ.. వినియోగదారులకు సౌకర్యం, అమ్మకందారులకు లాభం!

న్యూఢిల్లీ, నవంబర్ 5

రాజధాని ఢిల్లీలో కొత్త ఎక్సైజ్ విధానాన్ని తీసుకురావడానికి రేఖా గుప్త ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేస్తోంది. ఢిల్లీ ప్రభుత్వం సిద్ధం చేస్తున్న కొత్త మద్యం విధానంలో అనేక కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇందులో మద్యం దుకాణాల విస్తరణ, ఆధునీకరణ, అలాగే రిటైలర్లకు బాటిల్‌కి లాభాలను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రజా పనుల శాఖ మంత్రి ప్రవేశ్ వర్మ నేతృత్వంలోని కమిటీ ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఇది తుదిదశలో ఉందని తెలుస్తోంది. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మద్యం దుకాణాలను నివాస ప్రాంతాలు, పాఠశాలలు, దేవాలయాలు వంటి ప్రదేశాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న నాలుగు ప్రభుత్వ కార్పొరేషన్లు నిర్వహిస్తున్న మద్యం దుకాణాల వ్యవస్థను కొనసాగించాలని ప్రతిపాదించారు. దీని అర్థం ఏంటంటే ఇకపై ఢిల్లీలో ప్రైవేట్ కంపెనీలకు మద్యం దుకాణాలు నడపడానికి అవకాశం ఉండదు. కొత్త విధానం వినియోగదారులకు,



దుకాణదారులకు రెండింటికీ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో భారతదేశంలో తయారు చేసే విదేశీ మద్యం బాటిల్‌కి రూ.50, దిగుమతి మద్యం బాటిల్‌కి రూ.100 లాభ మార్జిన్ పెంచాలని నిర్ణయించారు. దీంతో దుకాణదారులు మెరుగైన, ప్రీమియం బ్రాండ్‌ల మద్యం నిల్వ చేయడానికి ఆసక్తి చూపుతారని

మొదటి పేజీ తరువాయి భాగం 2 లో

మొదటి పేజీ తరువాయి భాగం చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సంబురపడిపోయిన మజుందార్.. కూల్‌గా నడుచుకుంటూ తన ఇంటికి వెళ్లారు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు క్రికెటర్‌గా జాతీయ జట్టు తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడని మజుందార్ కోచ్‌గా టీమిండియాను విశ్వ విజేతగా నిలిపాడు. రెండేళ్ల క్రితం బాధ్యతలు చేపట్టిన అతడు జట్టులో నిలకడ, స్థిరత్వం.. విజయకాంక్ష వంటి లక్షణాలను రగిల్చాడు. కెప్టెన్ హర్మన్‌తో కలిసి ప్రతిభావంతులకు ప్రాధాన్యమిచ్చిన ఆయన.. వరల్డ్ కప్‌లో తన మార్క్ చూపించాడు. రెండు విజయాల తర్వాత వరుసగా మూడు పరాజయాలు ఎదురైన వేళ 'అధైర్యపడొద్దని.. సొంతగడ్డపై కప్‌ను గెలిచే సత్తా మీకుంద'ని హర్మన్ టీమ్‌లో ఆత్మవిశ్వాసాన్ని నూరిపోశాడు.ఇంకేముంది.. న్యూజిలాండ్‌పై భారీ విజయంతో సెమీస్ చేరిన టీమిండియా.. ఫైనల్లో ఆస్ట్రేలియాపై 5 వికెట్ల విజయంతో మూడోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరుకు ముందు ..'ఈ ఏడు గంటలు చాలా కీలకం. ఏం ఆలోచించకుండి. కప్ మనదే' అనే సందేశంతో భారత బృందాన్ని కార్యోన్ముఖులను చేశాడు మజుందార్. కోచ్ మాటల్ని ఒంటబట్టించుకున్న భారత క్రికెటర్లు.. గెలవాలనే కసితో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో సత్తా చాటారు. సమిష్టిగా రాణించి 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా తొలి కప్ కలను చెదరగొడుతూ జగజ్జేతలుగా అవతరించారు.

మొదటి పేజీ తరువాయి భాగం రసవత్తరంగా మారింది.
– కళాకారులు బరిలో.. కుల సమీకరణాలు కీలకం
ఈ విడతలో సినీ–సంగీత రంగం నుంచి కూడా బరిలో దిగిన అభ్యర్థులు హల్‌చల్ సృష్టిస్తున్నారు. జానపద గాయని మైథిలి ఠాకూర్‌ను బీజేపీ దర్భంగా జిల్లాలోని అలీనగర్ నుంచి పోటీలోకి దించింది. ఆమెకు మిథిలాంచల్ ప్రాంతంలో

మొదటి పేజీ తరువాయి భాగం ప్రగతిలో ముఖ్య సలహాదారు హోదా మరింత ప్రభావవంతంగా ఉండేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సచివాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో పలువురు నేతలు, అధికార ప్రముఖులు పాల్గొన్నట్లు తెలిసింది.

నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో 700కి పైగా మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిని నాలుగు ప్రభుత్వ సంస్థలు — డీఎస్ఐఐడీసీ, డీటీటీడీసీ, డీఎస్‌సీఎస్‌సీ, డీసీసీడబ్ల్యూఎస్ — నిర్వహిస్తున్నాయి. కొత్త విధానం ప్రకారం వీటిని మరింత ఆధునికంగా, విశాలంగా మార్చి మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లలో వినియోగదారులకు సౌకర్యవంతమైన విధంగా ప్రారంభించనున్నారు. 2021-22లో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం విధానం అవినీతి ఆరోపణలతో రద్దైంది. ఆ తరువాత 2022 సెప్టెంబర్‌లో తాత్కాలిక ఎక్సైజ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. అయితే ఆ విధానంలో కూడా అనేక అక్రమాలు బయటపడ్డాయి. దీంతో సీబీఐ, ఈడీ దర్యాప్తులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఆ పాత విధానాన్ని పలు మార్లు పొడిగించి మార్చి 31, 2026 వరకు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రేఖా గుప్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త ఎక్సైజ్ విధానం అవసరమని నిర్ణయించింది. కొత్త విధానాన్ని ఇప్పుడు ప్రజాభిప్రాయాల కోసం విడుదల చేస్తున్నారు. ఆపై మంత్రివర్గం, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం లభించిన తరువాత అమలు చేయనున్నారు. ఈ కొత్త విధానం ఢిల్లీలో మద్యం విక్రయ వ్యవస్థను మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా, వినియోగదారులకు అనుకూలంగా మార్చుతుందని ప్రభుత్వం పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి భాగం విశ్వసనీయతను నిలబెట్టుకుంది. ఈ గుర్తింపు తమ సంస్థలో ఉన్న మానవ వనరుల అభివృద్ధి విధానాలకు ప్రతిఫలమని కంపెనీ చైర్మన్ జయదేవ్ గల్లా పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, వృత్తి పరమైన ఎదుగుదల, ఆధునిక శిక్షణా విధానాలు తమ విజయానికి మూలకారణమని తెలిపారు. ఇది మా ఉద్యోగుల కృషికి, సంస్థ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం. 21 వేల మందికి పైగా ఉన్న మా కుటుంబం ఈ విజయానికి కారణం. ప్రతి మైలురాయి మాకు ప్రేరణగా నిలుస్తుంది అని ఆయన అన్నారు. ఫోర్బ్స్ సంస్థ ఈ జాబితాను రూపొందించేందుకు ప్రపంచ వ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో మూడు సంవత్సరాల కాలంలో మూడున్నర లక్షల మందికి పైగా ఉద్యోగుల అభిప్రాయాలను సేకరించింది. వారి సంతృప్తి, సంస్థల పట్ల ఉన్న నమ్మకం, ఉద్యోగ సంస్కృతి, భద్రత, వృత్తి పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ సర్వేలో అమర రాజా అత్యుత్తమ ప్రమాణాలు చూపినందున ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కిందని ఫోర్బ్స్ పేర్కొంది. ఉద్యోగుల సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చే విధానాలు, పారదర్శకమైన వ్యవస్థ, సామాజిక బాధ్యతల పట్ల నిబద్ధతతో అమర రాజా గ్రూప్ ఇప్పటికే అనేక పురస్కారాలు సాధించింది. ఇప్పుడు ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకోవడం ఆ సంస్థకు మరో మైలురాయిగా నిలిచింది. ఈ గుర్తింపు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలకు అంతర్జాతీయ వేదికపై గౌరవాన్ని తెచ్చిపెట్టిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మొదటి పేజీ తరువాయి భాగం సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాలకు భంగం కలిగే ఏ చర్యనైనా కాంగ్రెస్ అడ్డుకుంటుందని హామీ ఇచ్చారు. మైనారిటీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూడకుండా వారి అభివృద్ధి కోసం స్పష్టమైన విధానాలు అమలు చేస్తోందని వివరించారు. "న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధి మా సిద్ధాంతం. మైనారిటీల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు సెక్యులర్ విలువలను కాపాడాలనుకుంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# భక్తి దీప కాంతులతో కార్తీక పౌర్ణమి వేడుకలు

హైదరాబాద్):



కార్తీక మాసం ముగింపు గుర్తుగా వచ్చే కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని ఈరోజు తెలుగు రాష్ట్రాలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నాయి. దేవాలయాలు, ఘాట్‌లు, నదీతీరాలు, ఇళ్ల వద్ద దీపాలు వెలిగిస్తూ భక్తులు పూజలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక సందర్భంగా అనేక ప్రాంతాల్లో రుద్రాభిషేకాలు, హరతి కార్యక్రమాలు, దీపదానాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో వేములవాడ, వేంకటరమణ స్వామి దేవాలయం, భద్రాద్రి శ్రీరామాలయం, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో భారీగా భక్తులు తరలివెళ్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఉన్న శైవ, వైష్ణవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. విశాఖ బీచ్, రాజమహేంద్రవరం గోదావరి ఘాట్‌లు, ధర్మవరం చెరువులు, కృష్ణా నదీతీరాలు దీపోత్సవంతో కాంతులీనం అయ్యాయి. కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో అభిషేకం, విష్ణు ఆలయాల్లో దీపారాధన చేయడం, నదిలో స్నానం చేయడం, దీపదానం చేయడం విశేష ఫలితాలనిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఇళ్ల ముందు రొట్టెల దీపాలు వెలిగించడం, ఆకుల దీపాలు నదిలో వదలడం భక్తులు పాటించే సంప్రదాయాలు. కుటుంబాల ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాల చుట్టూ భద్రతా ఏర్పాట్లు బలపరిచారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేస్తూ భక్తుల రద్దీని పోలీసులు సమన్వయం చేస్తున్నారు. భక్తుల కోసం అన్నప్రసాదాలు, పాలు–నీటి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు దేవాలయ కమిటీలు తెలిపాయి.

## ఆస్తి వివాదంపై రియల్టర్ కిడ్నాప్
# మాజీ భార్య సహా 10 మంది అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 4 ;




అంబర్‌పేటలో రియల్టర్ మంత్రి శ్యామ్ కిడ్నాప్ ఘటన వెలుగులోకి రావడంతో నగరంలో కలకలం రేగింది. రూ.20 కోట్ల విలువైన ఆస్తి విక్రయంపై వివాదం కారణంగా, శ్యామ్‌ను ఆయన మాజీ భార్య మాధవీలత అపహరించేందుకు పథకం రచించినట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. ఈ కేసులో మాధవీలతతోపాటు మొత్తం పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అమెరికాలో నివసిస్తున్న సమయంలో శ్యామ్, మాధవీలతను వివాహం చేసుకున్నాడు. అయితే విభేదాలు రావడంతో మూడేళ్లకే విడాకులు తీసుకున్నారు. అనంతరం శ్యామ్ తన పేరును మార్చుకుని, ఫాతిమా అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. శ్యామ్ తండ్రి నుంచి వచ్చిన రూ.20 కోట్ల విలువైన ఆస్తిని విక్రయించడం మాధవీలత ఆగ్రహానికి కారణమైంది. దీంతో తన స్నేహితుడు సాయి సహకారంతో కిడ్నాప్ ప్లాన్ చేసింది. అక్టోబర్ 29న అంబర్‌పేట డీడీ కాలనీలో శ్యామ్ ఇంటిపై దాడి చేసి, కిరాయికి తీసుకున్న రెండు కార్లలో చెర్లపల్లి ప్రాంతానికి కిడ్నాప్ చేశారు. శ్యామ్‌ను విడుదల చేయడానికి రూ.1.5 కోట్లు డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే శ్యామ్ చాకచక్యంగా వ్యవహరించి, కిడ్నాప్ సమయంలోనే తన స్నేహితుడికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే ఆయనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు వేగంగా స్పందించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సంఘటనను విశ్లేషించిన పోలీసులు, ముఠాలో భాగమైన 14 మందిలో 10 మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, రెండు బైక్‌లు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నలుగురిని త్వరలో పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. శ్యామ్‌ను సురక్షితంగా రక్షించడం వల్ల అంబర్‌పేట ప్రాంతంలో ఉత్కంఠ పరిస్థితి తొలగిందని, కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగు చూసే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.


# జూబ్లీహిల్స్ ఎన్నిక "కారు vs బుల్డోజర్"గా మారింది : కేటీఆర్

- కాంగ్రెస్ గెలిస్తే పేదల ఇళ్లపై బుల్డోజర్లు వస్తాయన్న కేటీఆర్ హెచ్చరిక
- ప్రజా సంక్షేమం, విద్య, ఉద్యోగుల అంశాల్లో రేవంత్ ప్రభుత్వంపై

(హైదరాబాద్, నవంబర్ 4, 2025 – డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కారు – బుల్డోజర్ పోటీగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమాజీగూడలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతూ కాంగ్రెస్ తిరిగి గెలిస్తే పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుస్తాయని, ప్రజలను ఆదుకునే నాయకత్వం ఉండకపోవచ్చని ఆయన హెచ్చరించారు. వేధిస్తున్నారన్నది ఆయన ఆరోపణ. "ఇది ప్రభుత్వం కాదు... రౌడీ దర్బారు" అంటూ తీవ్ర



రెండు సంవత్సరాల్లోనే కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పథకాలను దెబ్బతీసిందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా కార్డు అమలు కాలేదని ప్రశ్నించారు. రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణాల పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "విద్యార్థుల భవిష్యత్తు కాపాడలేని ప్రభుత్వం అభివృద్ధి చేస్తానంటే ఎలా నమ్మాలి?" అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగులు మరియు రిటైర్డ్ సిబ్బందికి న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కొత్త పీఆర్‌సీ ఇస్తామని, డీఏలు పెంచుతామని చెప్పి ఉద్యోగులను మోసం చేశారని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు రెండేళ్లుగా ఇవ్వక వ్యాఖ్యలు చేశారు. పేదల ఇళ్లు కూల్చడంలో ప్రభుత్వం వేగంగా వ్యవహరిస్తూ, పెద్దల కేసుల్లో నిశ్శబ్దం పాటించడం అన్యాయమని విమర్శించారు.
బతుకమ్మ చీరలు, క్రిస్మస్ గిఫ్టులు, రంజాన్ తోఫా, కేసీఆర్ కిట్ వంటి ప్రజా పథకాలను నిలిపివేసి, జూబ్లీహిల్స్ అభివృద్ధి చేస్తున్నామంటూ కాంగ్రెస్ అడుగుతున్న ఓట్లు ప్రజలు నమ్మరని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మహిళలకు ఫ్రీ బస్ ఇచ్చి పురుషులపై డబుల్ ఛార్జీలు వేస్తున్నారని, గతంలో ఉచితంగా ఇచ్చిన తాగునీటికి ఇప్పుడు బిల్లులు విధిస్తున్నారని అన్నారు. "ఇది పదేళ్ల అభివృద్ధి మరియు రెండేళ్ల అరాచకం మధ్య పోటీ" అని పేర్కొంటూ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా గోపీనాథ్‌కి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.



# యాషెస్ సిరీస్‌కు ఆస్ట్రేలియా సిద్ధం..

న్యూఢిల్లీ, నవంబర్ 5

ఈనెల 21 నుంచి పెర్త్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరగనున్న యాషెస్ 2025



తొలి టెస్ట్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు జట్టును ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా దూరం కాగా.. స్టీవ్ స్మిత్ సారథిగా ఎంపికయ్యాడు. అనూహ్యంగా యువ ఆటగాడు వెదరాల్డ్‌కు సైతం జట్టులో చోటు దక్కింది. మరోవైపు ఇంగ్లాండ్.. రెండు నెలల క్రితమే జట్టును ప్రకటించింది.ప్రతిష్టాత్మక యాషెస్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ మ్యాచ్ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గాయంతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి ప్లేసులో స్టీవ్ స్మిత్ మరోసారి ఆస్ట్రేలియా కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ జట్టులో ఆస్ట్రేలియా ఎవరూ ఊహించని ఆటగాడికి చోటు కల్పించింది. ఇటీవల ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో సెంచరీల మోత మోగించిన జేక్ వెదరాల్డ్‌ను జట్టులోకి తీసుకుంది. ఇదే సమయంలో మార్నస్ లబుషేన్‌కు సైతం తిరిగి జట్టులో చోటు కల్పించింది.నవంబర్ 21 నుంచి తొలి టెస్ట్ మ్యాచ్ పెర్త్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్‌గా ఉస్మాన్ ఖవాజాకు ఒక ప్లేస్ ఖరారైంది. మరో స్థానంలో కోసం వెదరాల్డ్.. సీనియర్ ప్లేయర్ మార్నస్ లబుషేన్ మధ్య పోటీ నెలకొంది. వీరిద్దరిలో ఒకరు ఖవాజాతో పాటు ఇన్నింగ్స్ ప్రారంభించనున్నారు. ఇక కమిన్స్ గైర్హాజరీలో సీన్ అబాట్, బ్రెండన్ డాగెట్.. బ్యాకప్ పేసర్లుగా జట్టులోకి వచ్చారు. పేస్ ఆల్‌రౌండర్ల కోటాలో

# ఫ్యాన్స్‌కు అదిరిపోయే న్యూస్..
## 16 రోజుల్లో 4సార్లు ఢీ కొట్టనున్న భారత్ – పాక్

**ముంబై, నవంబర్ 5 :**

ఆసియా కప్ 2025లో మరోసారి భారత్, పాకిస్తాన్ క్రికెట్ జట్ల మధ్య ఉత్కంఠభరిత పోరాటం జరగనుంది. ఈ రెండు జట్లు ఇప్పటికే మూడు సార్లు తలపడగా, నవంబర్‌లో మరోసారి మైదానంలో ఢీకొనే అవకాశం ఉంది. మొత్తం మీద, ఒక నెల వ్యవధిలో భారత్, పాకిస్తాన్ నాలుగు సార్లు తలపడే పరిస్థితి ఏర్పడింది. ఈ 16 రోజుల సిరీస్‌లో అభిమానులు ఫోర్లు, సిక్సర్ల వర్షం, ఉత్కంఠ, రసవత్తర క్షణాలతో మునిగిపోనున్నారు. మొదటగా, నవంబర్ 7న హాంకాంగ్‌లో జరిగే సిక్సర్స్ టోర్నమెంట్‌లో రెండు జట్లు తలపడనున్నాయి. హాంకాంగ్‌లోని టిన్ క్వాంగ్ రోడ్ రిక్రియేషన్ గ్రౌండ్‌లో జరిగే ఈ మ్యాచ్ 6 ఓవర్ల ఫార్మాట్‌లో ఉంటుంది. తక్కువ ఓవర్ల కారణంగా అభిమానులకు పటాసుల వర్షం తప్పకుండానే ఉంటుంది. రెండు జట్లు నాకౌట్ దశకు చేరుకుంటే, ఈ టోర్నమెంట్‌లో రెండోసారి కూడా తలపడే అవకాశం ఉంది. ఇక నవంబర్ 14న ప్రారంభమయ్యే రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో నవంబర్ 16న భారత్, పాకిస్తాన్ మధ్య మరోసారి పోరు జరగనుంది. యువ ఆటగాళ్లకు వేదికగా నిలిచే ఈ టోర్నమెంట్‌లో, రెండు దేశాల కొత్త తారలు తమ ప్రతిభను చాటుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లీగ్ దశ పోరుతో పాటు, రెండు జట్లు సెమీఫైనల్ లేదా ఫైనల్ దశకు చేరుకుంటే, మళ్లీ ఢీకొనే అవకాశం ఉంది.దీంతో మొత్తం నాలుగు సార్లు



భారత్, పాకిస్తాన్ పోటీ పడే అవకాశం ఉండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని రగిలిస్తోంది. గత ఆసియా కప్‌లో జరిగిన ఉత్కంఠ పోరాటాలు, వివాదాల తర్వాత ఈ సిరీస్ మరింత ఆసక్తికరంగా మారింది. మరోసారి రెండు జట్ల మధ్య స్నేహహస్తం కలపకపోవడం వంటి చిన్న విషయాలు కూడా పెద్ద చర్చగా మారే అవకాశం ఉంది. మొత్తంగా, నవంబర్ నెల భారత, పాకిస్తాన్ క్రికెట్ అభిమానులకు నిజమైన పండుగగా మారబోతోంది.

# అర్ష్‌దీప్ తప్పింపుపై బౌలింగ్ కోచ్ క్లారిటీ

**న్యూఢిల్లీ, నవంబర్ 5 :**



అర్ష్‌దీప్ సింగ్ నాల్గవ టీ20ఐలో ఆడటం ఖాయం. ఈ మ్యాచ్ టీం ఇండియా గెలవడానికి చాలా కీలకం. ఎందుకంటే ఓడిపోతే సిరీస్ కోల్పోయినట్లే. అర్ష్‌దీప్ సింగ్ ఫామ్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్స్ అతని బౌలింగ్‌లో ఇబ్బంది పడుతున్నారు.భారత్, ఆస్ట్రేలియా మధ్య నాల్గవ టీ20ఐ క్వీన్స్‌ల్యాండ్‌లోని కరారా ఓవల్‌లో జరుగుతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు, భారత బౌలింగ్ కోచ్ మోర్న్ మోర్కెల్ మీడియాతో మాట్లాడుతూ, అర్ష్‌దీప్ సింగ్ లాంటి ఆటగాడిని ప్లేయింగ్ ఎలెవెన్ నుంచి ఎందుకు తొలగించారో వివరించారు.అర్ష్‌దీప్ సింగ్ భారత నంబర్ వన్ టీ20 బౌలర్. టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 100 కంటే ఎక్కువ మందిని అవుట్ చేసిన ఏకైక భారతీయ బౌలర్ అతను. అంతేకాకుండా, అతను హోబర్ట్ టీ20లో టీం ఇండియాను విజయపథంలో నడిపించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. కానీ ప్రశ్న ఏమిటంటే.. ఇంత అద్భుతమైన గణాంకాలు, ప్రతిభ ఉన్నప్పటికీ, అతనికి ప్రతి మ్యాచ్‌లోనూ అవకాశం ఎందుకు లభించదు? భారత బౌలింగ్ కోచ్ మోర్న్ మోర్కెల్ ఇప్పుడు సమాధానం అందించాడు. అర్ష్‌దీప్ సింగ్‌ను దూరంగా ఉంచడం టీం ఇండియాకు ఒక వ్యూహమని మోర్న్ మోర్కెల్ వివరించాడు.అర్ష్‌దీప్‌ను ఎందుకు బెంచ్‌లోనే కూర్చోబెడతారు? గురువారం జరగనున్న నాల్గవ టీ20ఐకి ముందు మోర్నే మోర్కెల్ మీడియాతో మాట్లాడుతూ, మొదటి టీ20ఐకి అర్ష్‌దీప్ సింగ్ గైర్హాజరు కావడానికి గల కారణాన్ని వివరించాడు. “అర్ష్‌దీప్ సింగ్ అనుభవజ్ఞుడైన బౌలర్. మేం విభిన్న కాంబినేషన్‌లను ప్రయత్నిస్తున్నామని అతను అర్థం చేసుకున్నాడు. అతను ప్రపంచ స్థాయి బౌలర్. పవర్‌ప్లేలో మాకు పుష్కలంగా వికెట్లు ఇచ్చాడు. అతను జట్టుకు ఎంత విలువైనవాడో మాకు తెలుసు. కానీ ఈ పర్యటనలో, మేం ఇతర కాంబినేషన్‌లను ప్రయత్నించాలనుకుంటున్నాం. అతను దానిని అర్థం చేసుకున్నాడు” అని మోర్కెల్ అన్నారు.జట్టు నిర్వహణ తీసుకునే ఈ నిర్ణయాలు ఆటగాళ్లపై కఠినంగా ఉండవచ్చని, అయితే టీ20 ప్రపంచ కప్‌నకు ముందు విభిన్న కలయికలను ప్రయత్నించడం చాలా ముఖ్యం అని మోర్నే మోర్కెల్ అన్నారు. “ఇది అంత సులభం కాదు. ఎంపిక విషయంలో ఎల్లప్పుడూ నిరాశ ఉంటుంది” అని మోర్కెల్ అన్నారు. నాల్గవ టీ20లో అర్ష్‌దీప్ సింగ్ ఆడటం ఖాయం.. అర్ష్‌దీప్ సింగ్ నాల్గవ టీ20ఐలో ఆడటం ఖాయం. ఈ మ్యాచ్ టీం ఇండియా గెలవడానికి చాలా కీలకం. ఎందుకంటే ఓడిపోతే సిరీస్ కోల్పోయినట్లే. అర్ష్‌దీప్ సింగ్ ఫామ్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్స్ అతని బౌలింగ్‌లో ఇబ్బంది పడుతున్నారు. అర్ష్‌దీప్ సింగ్ ఆస్ట్రేలియాతో జరిగిన ఆరు మ్యాచ్‌లలో 10 వికెట్లు పడగొట్టాడు. ఈ గణాంకాలు అతను ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ప్రధాన వికెట్లు తీసిన బౌలర్ అని స్పష్టంగా సూచిస్తున్నాయి. అర్ష్‌దీప్ 66 టీ20I లలో 104 వికెట్లు పడగొట్టాడు.

# నెంబర్ వన్ ర్యాంకుల్లో అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి..!



ముంబై, నవంబర్ 5 అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీమిండియా యువ బ్యాటర్స్ అభిషేక్ శర్మ నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దాంతో నెంబర్ వన్ బ్యాటర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ మూడోస్థానంలో ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రెండోస్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్, నాలుగో స్థానంలో నిస్సంక (శ్రీలంక), నాలుగో స్థానంలో జోస్ బట్లర్ (ఇంగ్లండ్), ఆరోస్థానంలో ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఏడోస్థానంలో టిమ్ సీఫెర్ట్ (న్యూజిలాండ్), తొమ్మిద స్థానంలో కుషాల్ పెరీరా (శ్రీలంక), పదో స్థానంలో మిచేల్ మార్ష్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో విజయం తర్వాత పాక్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్ మెరుగయ్యాయి. కెప్టెన్ బాబార్ ఆజం తొమ్మిదిస్థానాలు మెరుగుపరుచుకొని 30వ స్థానానికి చేరుకున్నాడు. సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘా పదిస్థానాలు ఎగబాకి 39, 54 స్థానాలకు చేరారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 12వ స్థానానికి, బంగ్లాదేశ్‌కు చెందిన టాంజిద్ హసన్ 17వ స్థానానికి, ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ వరుసగా 15, 20వ స్థానాల్లో ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని 10వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ముజీబ్ ఉర్ రెహమాన్, మహేది హసన్ 14, 17వ స్థానానికి చేరుకున్నారు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హోల్డర్, రోస్టన్ చేజ్ 23, 38వ స్థానానికి చేరుకున్నారు. పాక్‌తో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ 15 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. టీమిండియా మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికందర్ రజా, వెస్టిండిస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టీ20ల్లో రజా 33 బంతుల్లో చేసిన సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, అక్సర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. అభిషేక్ శర్మ 16వ స్థానంలో ఉన్నాడు.

# బంగ్లాదేశ్ క్రికెట్‌లో వివాదం..

**ముంబై, నవంబర్ 5 :**

బంగ్లాదేశ్ మహిళా క్రికెట్‌లో పెను వివాదం చెలరేగింది. కెప్టెన్ నిగర్ సుల్తానా జూనియర్ ఆటగాళ్లను దుర్భాషలాడుతూ, దాడి చేస్తుందని ప్రముఖ ఫాస్ట్ బౌలర్ జహానారా ఆలం సంచలన ఆరోపణలు చేసింది. పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశంతో కూడినవంటూ బంగ్లా క్రికెట్ బోర్డు ఆరోపణలను కొట్టిపడేసింది. బంగ్లాదేశ్ వార్తాపత్రిక కలేర్ కాంతోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జహానారా ఆలం అనేక పలు కీలక వ్యాఖ్యలు చేసింది. నిగర్‌కు ఇదేం కొత్త కాదని. జూనియర్ ఆటగాళ్లను వేధించడంతో పాటు చెంపదెబ్బలు కొడుతుందని మండిపడింది.ప్రపంచకప్ సమయంలోనూ, దుబాయి పర్యటనలోనూ కెప్టెన్ నిగర్ జూనియర్‌ను గదిలోకి పిలిచి చెంపదెబ్బ కొట్టిందని ఆరోపించింది. జట్టు వాతావరణం క్రమంగా విషపూరితంగా మారుతోందని జహానారా ఆలం పేర్కొంది. 2024లో యూఏఈలో జరిగిన టీ20 ప్రపంచ కప్ సమయంలో తాను తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నానని, దాంతో రెండు నెలల విరామం తీసుకున్నానని చెప్పుకొచ్చింది. బంగ్లాదేశ్ జట్టులో దాదాపు ప్రతీ ప్లేయర్ ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నారని.. ఒకరు లేదా ఇద్దరు ఆటగాళ్లు ఎక్కువ సౌకర్యాలు పొందుతారని.. మిగిలిన వారిని విస్మరిస్తున్నట్లుగా తెలిపింది. సీనియర్స్‌ను తొలగించే ప్రక్రియ 2021లో ప్రారంభమైందని.. తనను క్రమంగా జట్టు నుంచి తప్పించారని జహరానా ఆరోపించింది.
అయితే, ఆరోపణలను బంగ్లా క్రికెట్ బోర్డు తోసిపుచ్చింది. ఆరోపణలన్నీ నిరాధారమని, దురుద్దేశంతో చేసినవేనని పేర్కొంది.



అంతర్జాతీయ స్థాయిలో జట్టు రాణిస్తున్న సమయంలో ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు నిరాశపరిచాయని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్ క్రికెట్ ఇకపై ఎలాంటి సంబంధం లేని ఓ క్రీడాకారిణి ఇలాంటి తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. అయితే, వివాదంపై కెప్టెన్ నిగర్ సుల్తానా స్పందించలేదు. ఈ ఆరోపణలు డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం, మహిళా క్రికెట్ ఇమేజ్ గురించి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జట్టు నాయకత్వం, ప్లేయర్స్, సహాయక సిబ్బందిపై పూర్తి విశ్వాసం ఉందని.. ఎలాంటి దర్యాప్తు అవసరం లేదని బీసీబీ చెప్పుకొచ్చింది.